ఉచిత బస్సుకు రైట్..రైట్ ఎప్పుడో..?

గద్దెనెక్కడమే లక్ష్యంగా టీడీపీ హామీలు గుప్పించింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.. రైతులకు పెట్టుబడి సాయం రూ 20 వేలు..ప్రతి నెలకు మహిళలకు రూ 1500, యువతకు నిరుద్యోగ భృతి రూ 3 వేలు.. అంటూ సూపర్ సిక్స్ హామీలతో ఊదరగొట్టింది. అధికారంలోకి వచ్చాక ప్లేట్ ఫిరాయించారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణమని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ప్రకటించగా.. మరో మంత్రి నారా లోకేష్ రోడ్డు మ్యాప్ వేసి వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిస్తామంటూ పిల్లిమొగ్గలు వేశారు.

- హామీ ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- అసహనం వ్యక్తం చేస్తున్న మహిళలు



పాలసముద్రం : ఆంధ్రప్రదేశ్ కంటే తొలుత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో వెంటనే మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేసింది. తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉంది. అయితే ఇదే హామీని అందుకున్న టీడీపీ మన రాష్ట్రంలోనూ ఊరూ వాడా ఓ అని ప్రచారం చేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఉచిత బస్సుకు రైట్..రైట్ చెప్పలేదు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 18 ఏళ్ల పైబడిన మహిళలు 1,06,564 మంది ఉన్నారు. ఇక, నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. చిత్తూరు నుంచి గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసులు రోజు 53 నడుస్తున్నాయి. రోజూ సగటున 40 శాతం మంది మహిళలు ఈ బస్సులో ప్రయాణిస్తున్నారు.

ఉచిత ప్రయాణంపై స్పష్టతేదీ?

ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణం అని సామాజిక మాధ్యమాల్లో ఈ మధ్య జోరుగా ప్రచారమైంది. ఆ తర్వాత దీపావళి అంటూ మళ్లీ ప్రచారం మారింది. నుంచి వదంతులు సోషల్ మీడియోలో హల్ చల్ చేసిన విషయం అందరికి తెలిసిందే. మంత్రి నారా లోకేష్ వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిస్తామనడంతో హామీలను అటకెక్కించినట్లేనని చెప్పకనే చెప్పినట్టైంది.

చంద్రన్నా..! ఉచిత ప్రయాణం ఎప్పుడన్నా?



ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం హామీని ఇప్పటివరకు సీఎం నెరవేర్చలేదు. పొరుగు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తే ఇక్కడ మాత్రం దాటవేస్తున్నారు. ఇదేం పద్ధతి? సూపర్ సిక్స్ హామీలు అన్నీ అమలు చేయాలి.

–రాణి, మాజీ సర్పంచ్, పాలసముద్రం

టీడీపీ పెద్దల తీరు బాగోలేదు



ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోందని అని చంద్రబాబు అంటే ఎలా? టీడీపీ నాయకులు ఆరోజు ఇంటింటికీ వచ్చి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఓట్లు వేసుకున్నారు. ఇప్పుడేమో ఉచిత బస్సు అతీగతీ లేదు.

–లిల్లీ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్, ఆముదాల

చంద్రబాబును నమ్మి ఓటెయ్యడమే తప్పు



చంద్రబాబు మాటలు నమ్మి ఓటెయ్యడమే తప్పు. ఇప్పుడు ఆలోచించి ఏం లాభం? మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉత్తుత్తిదే అనుకోవాలేమో! మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి.

–భీయాల్లా, గృహిణి, తిరుమలరాజుపురం దళితవాడ

పార్టీ అధినేతను కలిసిన గురవారెడ్డి



మాజీ ముఖ్యమంత్రి జగన్నకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గురవారెడ్డి

శ్రీరంగరాజపురం : ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల దాడులు, చేయిస్తున్న అరెస్టులు, పలు సమస్యలను అధినేత దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో చొక్కమడుగు గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డి బుధవారం అన్నదానం చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ, ఆలయంలో అన్నదానం చేయాలనే సంకల్పంతో దాతలు ముందుకొస్తుండటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంగ వైకల్యం పిల్లలకు వైద్య పరీక్షలు



పిల్లలను వైద్యపరీక్షలకు పంపుతున్న వైద్యాధికారులు

నింద్ర: మండలంలోని అంగ వైకల్యం కలిగిన పిల్లలకు ప్రత్యేక వైద్యాధికారులతో వైద్య పరీక్షలు చేయించనున్నట్టు మండల వైద్యాధికారి వినిషా తెలిపారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులను గుర్తించి వారిని జిల్లా కేంద్రంలో ప్రత్యే పరీక్షలు చేయిస్తామన్నారు. ప్రస్తుతం ఏడుగురు పిల్లలను ప్రత్యేక వాహనంలో వైద్య పరీక్షలకు పంపినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీదేవి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంటలను చీడపీడలు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం కోరారు. బుధవారం మండలంలోని అగరం, అత్తూరులో వరి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా పిచికారీ చేయించాలన్నారు. వరిలో లద్దె పురుగులను నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు.

పశువులకు గాలికుంటు టీకాలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి సంధ్య సౌందర్య కోరారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పాడి పశువులకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ, గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు టీకాలు వేయించాలన్నారు. ముఖ్యంగా పాడి ఆవులకు పాల దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగ కారడం , కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం చికిత్స చేయించాలని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం: మండలంలోని బీఎల్‌ఓలు బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ అరుణ కుమారి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో తహసీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మోహన్ రాజా సమీక్షించారు. బీఎల్‌ఓలు పార్టీలకతీతంగా కొత్త ఓటర్లను ఎలా చేర్చాలి? మృతుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను కొత్తగా ఓటర్లుగా నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ జయశ్యామ్, నియోజకవర్గ ఎన్నికల ఆపరేటర్లు భువనేశ్వరి, కమిత, శివకుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నివాళి



కోదండరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి, నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం సాతంబాకం పంచాయతీ మిట్టూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దేవరాజులురెడ్డి తండ్రి కోదండరెడ్డి(72) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి ఆ గ్రామానికి వెళ్లి కోదండరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట పెనుమూరు మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, సాతంబాకం ఎంపీటీసీ యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, నవీన్‌కుమార్‌రెడ్డి, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్‌పై నియంత్రణ అవసరం



సదస్సును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు

పుత్తూరు: మానవుని జీవితంలో ప్లాస్టిక్ ఓ భాగమైనప్పటికీ దీని వినియోగంపై నియంత్రణ ఉండాలని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య అన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై బుధవారం కళాశాలలో సదస్సు, పునర్వినియోగంపై ప్రదర్శన కార్యక్రమాలను వృక్ష శాస్త్ర విభాగం, కళాశాల ఇకో క్లబ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ కవర్లలోని ఆహారం తీసుకోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల హానికర వాయువులు విడుదలై క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రీ-సైక్లింగ్ ప్రదర్శనశాలను అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి కోటేశ్వరరావు, ఇకో క్లబ్ కన్వీనర్ పద్మావతి, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ సుజన, వైస్ ప్రిన్సిపాల్ మన్యం నరసింహులు, అధ్యాపకులు వాణిశ్రీ, శామ్సన్‌రాజు, శ్రీదేవి, వసంతకుమార్, నరసింహులు, హరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రౌపదీదేవికి పొంగళ్లు



పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో బుధవారం మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. మహా భారత ఉత్సవాలు నిర్వహించి 41 రోజులు పూర్తవుతున్న సందర్భంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి పూజలు చేసి, పిండి వంటలు వండారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ముఖ్యం

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

పుత్తూరు: న్యాయవాదులు మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్సీ రాఘవేంద్ర అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కోర్టులో న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, వాజ్యం కంటే మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకుని సంతృప్తికరమైన ఫలితం పొందవచ్చన్నారు. మధ్యవర్తిత్వంతో పరిష్కృతమైన కేసుల్లో కోర్టు ఫీజులను వాపసు చేస్తామని స్పష్టం చేశారు. మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు కేసుల నుంచి ఉపశమనం, మనశ్శాంతి కలుగుతుందన్నారు. దీనిపై న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే.రమ్యసాయి ప్రసంగించారు. అనంతరం మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఆణివార ఆస్థానం



శ్రీవేణుగోపాలస్వామికి ఆణివార ఆస్థానం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: స్థానిక శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం ఆణివార శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని సుప్రభాత సేవతో వేదపండితులు మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన..ఇత్యాది నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం టీటీడీ ఆనవాయితీ ప్రకారం స్వామివారికి వెండితో తయారు చేసిన ఈగల దండ(ఆణివారి మాల)తో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేద పండితులు శబరీష్, రమేష్, గోపాలచారి, షరాబ్ బాబు సురేష్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సులకు ఫిజియోథెరపీపై శిక్షణ

సత్యవేడు: ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న నర్సులకు ఫిజియోథెరపీపై శిక్షణ ఇస్తున్నట్లు సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాల ఫిజియోథెరఫిస్ట్ డాక్టర్ సురేఖ తెలిపారు. బుధవారం సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలలోని నర్సులకు ఫిజియోథెరపీ క్లాసులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఫిజియోథెరపీతో శారీరక పనితీరును పెంచవచ్చన్నారు. శరీర నిర్మాణ శాస్త్రం, శరీర ధర్మశాస్త్రం, అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. దీనితో పాటు మనస్తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలన్నారు. దాసుకుప్పం, పిచ్చాటూరు, చిన్నపాండూరు, బుచ్చినాయుడుకండ్రిగ, ఎంపేడు, కోవనూరు ఆరోగ్య కేంద్రాలకు ఫిజియోథెరపీ పరికరాలు అందజేసినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి



జయరాజ్

నగరి : స్థానిక సెయింట్ మేరీ చర్చి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయరాజ్ (75) బుధవారం మృతిచెందాడు. విజయపురం మండలం కేవీ శ్రీరామపురానికి చెందిన ఈయన చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు సీఐ విక్రమ్ తెలిపారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ

తవణంపల్లె: మండలంలోని సచివాలయాలను బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. పైమాఘం, అరగొండ, గాజులపల్లె, మల్లకుంట రైతు సేవా కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల్లో మామిడి రైతుల వివరాలు తప్పులు తడకగా లేకుండా సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మామిడి రైతులకు ప్రభుత్వం ఇచ్చే కిలో రూ.4 సబ్సిడీ ప్రతి రైతుకు వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. మామిడి రైతులు ఏఏ ఫ్యాక్టరీకి ఎన్ని టన్నుల కాయలు తరలించారు ? రైతుల బ్యాంకు ఖాతా, పాసు పుస్తకాల వివరాలు, క్రాప్ బుకింగ్ చేశారా ? లేదా ? అనే వివరాలను ఆరా తీశారు. రైతులు ఏవైనా సరైన వివరాలు ఇవ్వకపోతే క్షేత్రస్థాయిలో రైతులతో కలసి పూర్తి వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో సవరించి నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో రైతులతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ సుధాకర్, వ్యవసాయాధికారి ప్రవీణ్, హార్టికల్చర్ అధికారి సాగరిక, ఏఓ రెడ్డిబాబు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టరాదని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కార్యదర్శులు నాగరాజు, గంగరాజు మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. మరోసారి 2024-25 వినియోగంపై రూ.842 కోట్లు సర్దుబాటు చార్జీలతో వినియోగదారులకు షాక్ ఇవ్వడానికి సిద్ధమైందన్నారు. వీటిపై సదరన్, సెంట్రల్ పంపిణీ సంస్థలు చేసిన తాజా ప్రతిపాదనలను తక్షణం విరమించుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేసుకున్న సెకీ ఒప్పందాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఒప్పందాన్ని కొనసాగించారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడం దుర్మార్గమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వామపక్షాల ఆధ్వర్యంలో దశలవారీగా మరోసారి విద్యుత్ పోరాటానికి సన్నద్ధమైనట్టు చెప్పారు. స్మార్ట్ మీటర్లు పెడితే జరిగే నష్టాలపై ప్రచారం చేస్తామన్నారు. గత సంవత్సరం నుంచి యూనిట్‌కు 40పైసలు చొప్పున వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని, ఇప్పటికే పెరిగిన కరెంటు బిల్లుతో నానా అవస్థలు పడుతున్న వినియోగదారులపై మరో రూ.842 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపే ప్రతిపాదనలు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలసుబ్రమణ్యం, జ్యోతిరావు, జ్యోతి, గోపి, దాసర చంద్ర, మణి, విజయ్ గౌరి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ధ్వజారోహణం



పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి



ఆలయంలో చేస్తున్న హోమ పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం చెంగల్రాయస్వామి సన్నిధి వద్ద వైభవంగా ధ్వజారోహణం పూజలు, స్వామివారికి విశేష అభిషేక, హోమపూజలు చేశారు. చెంగల్రాయ స్వామి వద్ద ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు చేసిన అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, హోమపూజలు చేశారు. ఆ తర్వాత ధ్వజారోహణ పూజలు శాస్త్రోక్తంగా కార్యక్రమంలో ఆలయ ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చంద్రుడిపై శ్రీరామచంద్రుడి అభయం



చంద్రుడిపై శ్రీరామచంద్రుడి విలాసం



ఉయ్యాలసేవలో సీతారామలక్ష్మణులు

తవణంపల్లె: మండలంలో టి.పుత్తూరులో నిర్వహిస్తున్న కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీరామచంద్రుడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఉభయదారులు స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించారు. సాయంకాలం ఉభయదారులు చంద్రప్రభ వాహనసేవకు గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలతో పాటు పూజాసామగ్రి, ప్రసాదాలు, పండ్లు, వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు.

అమ్మపూజకు వేళాయె..!



నేత్రప్రదాయిని క్షేత్రం



ఆలయ ప్రవేశ ద్వారం



దేశమ్మ దేవత

- నేటి నుంచి ఆడి నెల ఉత్సవాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార గణం

నగరి : స్థానిక టీఆర్ కండ్రిగలోని నేత్రప్రదాయిని దేశమ్మ క్షేత్రంలో గురువారం నుంచి ఆడి నెల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. కంటిచూపునిచ్చే దేవతగా ఇక్కడ అమ్మవారు పూజలందుకుంటోంది. మరెక్కడా లేనివిధంగా తీర్థం కళ్లలో పోయడం ఈ ఆలయం ప్రత్యేకత. ఈ ప్రత్యేకత కలిగిన ఆలయంలో ప్రతి ఏటా ఆడి నెల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా రావడం పరిపాటి. దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు ఆలయ ప్రాంగణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆడి మంగళవారాల్లో ప్రత్యేక పూజలు

ఆడి నెలలో మంగళవారం పూజలు అమ్మవారికి ప్రత్యేకం కావడంతో ఆ రోజుల్లో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేస్తారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టడానికి, తలనీలాలు సమర్పించడానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. దీంతో మంగళవారాలు ఆలయం భక్తులతో కిటకిటలాడిపోతుంది.

ఆలయచరిత్ర

ఆలయ పురాణం మేరకు పార్వతీదేవి ఇక్కడ దేశమ్మ దేవతగా విరాజిల్లుతోంది. శివుడి శాపంతో అలిగి భూలోకానికి వచ్చిన పార్వతి దేశ సంచారం చేస్తూ ఇక్కడ తపస్సు చేసినట్లు ప్రచారంలో ఉన్న గాథ. అందుకే అమ్మవారికి దేశమ్మ అన్న పేరు వచ్చింది. పూర్వం అరణ్యంలా ఉన్న ఈ ప్రాంతంలో ముళ్ల కంపల కోసం వచ్చిన కంటి చూపు కోల్పోయిన ఒక వృద్ధురాలికి కంటిలో నీరు పోసి దేశమ్మ కంటిచూపు నిచ్చిందని ప్రతీతి. దీంతో నేత్ర ప్రదాయినిగా అమ్మవారు ఇక్కడ కొలువుదీరారు. కార్వేటినగరం రాజుకు కంటిపూత వచ్చిన సమయంలో ఆలయ విశిష్టతను తెలుసుకుని ఇక్కడకు వచ్చి పూజించి తీర్థం కళ్లలో వేసుకోగా కంటిపూత నయమైందట! దీంతో 1870లో ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆలయంలో తీర్థం కంటిలో పోయడం సంప్రదాయమైంది. ఇలా మరే ఆలయంలోను తీర్థం కంటిలో పోసే సంప్రదాయం లేదు. 1952లో దేవదాయశాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకుని ఆలయ పర్యవేక్షణకు కార్యనిర్వహణాధికారిని నియమించింది. అప్పటి నుంచి ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో పరిపాలన జరుగుతూ వస్తున్నా అప్పుడప్పుడు చిన్నపాటి మరమ్మతులు మాత్రమే జరిగేవి.

మాజీ మంత్రి హయాంలో నూతన ఆలయం

ఆలయ నిర్మాణం జరిగి 154 ఏళ్ల అనంతరం శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని మంత్రిగా ఉన్నప్పుడు ఆర్కేరోజా ప్రత్యేక చొరవ తీసుకొని రూ.3.60 కోట్లు మంజూరు చేయించి అత్యద్భుతంగా పునర్నిర్మించారు. ఆలయ నిర్మాణంతో పాటు పరివార దేవతలైన వినాయక, సుబ్రమణ్య, నాగదేవత ఆలయాలు, ఆర్వో వాటర్ ప్లాంటు, భక్తులకు తగిన విధంగా మరుగుదొడ్లు, మినీ కళ్యాణ మండపం, నవగ్రహ మండపం, పొంగళ్ల మండపం, విడిది గదులు, కళ్యాణ కట్ట...ఇలా అన్ని సదుపాయాలు కల్పించారు. టీటీడీ నుంచి శ్వేత వస్త్రాలు సమర్పించే ఏర్పాటు చేశారు.